

జిల్లా కలెక్టర్ మనుచౌదరితో జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, తదితరులు

గ్రంథాలయాల సమస్యలు పరిష్కరించండి


సిద్దిపేట టౌన్, సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లోని సమస్యలు పరిష్కరించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి.. కలెక్టర్‌ను కోరారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడారు. దుబ్బాకలో గ్రంథాలయానికి సొంత భవనం లేదని తెలిపారు. మిరుదొడ్డిలో ప్రహరీ, శౌచాలయాలు కట్టించాలని పేర్కొన్నారు. కలిసిన వారిలో విశ్రాంత గ్రంథపాలకుడు రవీందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ర్యాంకులు సాధించాలి: కలెక్టర్

విద్యార్థులు కష్టపడి చదివి నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించాలని కలెక్టర్ సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో పైపులైన్, శౌచాలయాల సమస్యలను కలెక్టర్ దృష్టికి ప్రిన్సిపల్ లక్ష్మాంజలి తీసుకెళ్లారు. చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో అధికారులకు కలెక్టర్ చెప్పారు. పట్టణంలోని ఎస్సీ బాలురు వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, పంకాలు, దీపాలు, అదనపు గదులు, శౌచాలయాల సమస్యలను సంక్షేమ అధికారిణి కవిత వివరించారు.

● సిద్దిపేటలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను కలెక్టర్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. నైపుణ్యం లేని వారిని గుర్తించి శిక్షణ ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ఉదయశ్రీ తదితరులు ఉన్నారు.

రాజగోపురంలోనే వనదుర్గకు పూజలు



సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ప్రవాహం కొనసాగుతుంది. గురువారం కూడా ఆలయం వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో రాజగోపురంలోనే అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. -న్యూస్‌టుడే, పాపన్నపేట.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన చిన్నకోడూరు నాయకులు



చిన్నకోడూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను చిన్నకోడూరు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నామినేటెడ్ పోస్టుల్లో(చిన్నకోడూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా) అవకాశం ఇవ్వాలని కోరినట్లు నాయకుడు అజ్జుయాదవ్ తెలిపారు.

లెక్క తక్కువైనా వ్యాపారికే అమ్మకం

కొనుగోలు కేంద్రాల్లో తూకాలు చేపట్టక.. ధాన్యాన్ని తరలిస్తున్న కర్షకులు

జిల్లాలో వరి సాగు	3,68,000 ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా	8,00,000 టన్నులు
సేకరణ లక్ష్యం	4,00,000 టన్నులు
కొనుగోలు కేంద్రాలు	417
తెరిచినవి	211
కొనుగోలు చేసిన ధాన్యం	374 క్వింటాళ్లు
రైతుల సంఖ్య	7

గజ్వేల్, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట, చేర్యాల, నంగునూరు, దుబ్బాక, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వ్యవహారం గందరగోళంగా మారింది. కేంద్రాలు తెరిచినా ఇంకా మిల్లుల ఎంపికపై స్పష్టత రాకపోవటంతో కొనుగోళ్లు ముందుకు సాగటం లేదు. పంట చేతికొచ్చినా ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు లేకపోవటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. వర్షాలు గుబులు పుట్టిస్తుండటంతో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానాయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని లక్ష్యంగా నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 3న గజ్వేల్‌లోని మార్కెట్‌యార్డులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఇప్పటి వరకు ఒక్క సంచైనా కొనలేదు. తేమ 17 శాతానికి మించకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాలు ఆరనివ్వటం లేదని చెబుతున్నారు. కొనుగోలు చేసిన వడ్లను పంపించేందుకు జిల్లాలో సుమారు 140 మిల్లుల వరకు సీఎంఆర్ కోసం ఎంపిక చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ధర తక్కువైనా సరే వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. తేమ, సంచులు, హమాలీ పేరుతో కోతలు వేస్తూ వారు కొంటున్నారు.



నంగునూరులో వ్యాపారులకు విక్రయిస్తూ..

మద్దతు ధర..	
ఏగ్రేడు	రూ.2320
బిగ్రేడు	రూ.2300
ప్రైవేటులో దక్కుతున్న ధర	రూ.1950

వేగం పెంచుతాం

-ప్రవీణ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్

ఇప్పటి వరకు 211 చోట్ల కేంద్రాలు తెరిచాం. వారంలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తాం. మిల్లుల ఎంపికపై ఇంకా స్పష్టత రాలేదు. రాగానే కొనుగోళ్లలో వేగం పెంచుతాం.

రహదారులే కల్లాలు

పంట ఉత్పత్తులను(ధాన్యం) ఆరబెట్టేందుకు కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో సరిపడా స్థలం లేక ప్రతి యేటా అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. రహదారులపైనే ఆరబెడుతున్నారు. సిద్దిపేట జిల్లాలో అనేక చోట్ల కొనుగోలు కేంద్రాలకు పూర్తి స్థాయిలో స్థలాలు లేక విక్రయాలు పూర్తయ్యేవరకు రహదారులపైనే ఆరబెడుతూ అక్కడే విక్రయిస్తూ రైతులు అవస్థలు పడుతున్నారు. దుబ్బాక మండలం అప్పనపల్లికి చెందిన దువ్వాసి భానుప్రసాద్ ఈ సంవత్సరం ఏప్రిల్‌లో తిమ్మాపూర్‌లో వివాహానికి హాజరై బైకుపై తిరిగి వస్తుండగా సిద్దిపేట గ్రామీణ మండలం తోర్నాల వద్ద రహదారిపై ధాన్యం కుప్పను ఢీకొని మృత్యువాత పడ్డాడు. అప్పనపల్లి, తోర్నాలలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి సరిపడా స్థలం లేదు. రోడ్డుపై కుప్పలు పెడుతున్నారు. నంగునూరులో కర్షకులు పంట సంరక్షణకు ఆరబెట్టి, కుప్పలు చేసినచోట రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారు. నంగునూరు మండలంలోని గట్ల మల్యాల, కొండంరాజుపల్లి, ఘనపూర్, అక్కెనపల్లి, ఆంక్షాపూర్‌లో వ్యాపారులకు 10 లారీల ధాన్యాన్ని విక్రయించారు.



అప్పనపల్లిలో రహదారిపై ఆరబోసిన ధాన్యం

టోల్‌ఫ్రీ నంబరుతో ఉచిత న్యాయ సహాయం



గోడపత్రికలను విడుదల చేస్తున్న జడ్జీలు సాయిరమాదేవి, స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లే, శ్రావణియాదవ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రజలకు న్యాయసేవలను మరింత చేరువ చేసేందుకు న్యాయశాఖ కృషి చేస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. ఇందుకోసమే న్యాయశాఖ టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసిందన్నారు. ఈ మేరకు సిద్దిపేటలోని జిల్లా కోర్టు ఆవరణలో టోల్‌ఫ్రీ నెంబరుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. 15100 టోల్‌ఫ్రీ నంబరును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసు భద్రతా పథకం ఆసరా: సీపీ



చెక్కు అందిస్తున్న అనురాధ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం తమ శాఖ ఎప్పుడూ కృషి చేస్తుందని పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. పోలీసు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పోలీసు భద్రత పథకం ఆసరాగా ఉంటుందన్నారు. సిద్దిపేట మూడో పట్టణ ఠాణాకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ సలీమ్ నాలుగు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందగా పథకానికి సంబంధించి రూ.7.90 లక్షల చెక్కును గురువారం కమిషనరేట్‌లో సలీమ్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఏవో యాదమ్మ, పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సిద్దిపేట ఇమాంబాద్‌కు చెందిన రైతు లక్ష్మి శిరస్త్రాణం ధరించి వడ్లను మార్కెట్ యార్డులో నేర్పుతున్నారు. పైన ఎండ కొడుతోంది. వడ్ల నుంచి దుమ్ము లేస్తోంది. రెండిటి నుంచి రక్షణకు ఆమె ధరించారు.

శ్రమయేవ రైతు జయతే

అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకొని పొలంలో శ్రమించడం రైతుకు మట్టి వాసనతో పెట్టిన విద్య. పంట పండించడంతోనే అన్నదాత కష్టం సరిపోదు. ధాన్యాన్ని ఆరబోయాలి.. తూర్పారా పట్టాలి. అమ్ముకొని తర్వాత సీజన్ సాగుకు సిద్ధం కావాలి. ఈ చిత్రమే ఓ నిదర్శనం. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ వద్ద వడ్లను తూర్పారా పట్టేందుకు యంత్రాన్ని వృద్ధ రైతులు లాక్కెళుతున్నారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట



అన్నాదమ్ముళ్లు.. సైక్లింగ్‌లో పతకధారులు



సూరంపల్లి సుమిత్



సూరంపల్లి అమిత్

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: సైక్లింగ్ అనేది ఖరీదైన ఆట. సాధారణ పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఈ క్రీడను ఎంచుకుంటారు. ఇందులో రాణించాలంటే ఆటకు సరితూగే సైకిళ్లు ఉండాలి. ఈ నేపథ్యంలో అన్నాదమ్ముళ్లు సైక్లింగ్‌లో సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. అక్కన్నపేట మండలం అంతకపేటకు చెందిన సూరంపల్లి రవికుమార్, రాజ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. అందులో పెద్దవాడు సుమిత్, చిన్నవాడు అమిత్. కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం వారి కుటుంబం హుస్నాబాద్‌లో ఉంటున్నారు. తండ్రి రవికుమార్ కులవృత్తి అయిన క్షౌరశాల నిర్వహిస్తున్నారు. తల్లి గృహిణి. వారి కుమారుల్లో సుమిత్ 8వ తరగతి వరకు, అమిత్ 7వ తరగతి వరకు స్థానిక ఆదర్శ పాఠశాలలో చదివారు. వారికి చిన్నప్పటి నుంచి సైక్లింగ్ అంటే ఇష్టం. ఇంట్లో పాత సైకిల్‌పై రకరకాల ప్రయోగాలతో తొక్కేవారు. వారి ఆసక్తిని గమనించిన తండ్రి గౌరవెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న జంగపల్లి వెంకటనర్సయ్య దృష్టికి తీసుకువెళ్లారు. వారిద్దరికీ సైక్లింగ్ క్రీడలో శిక్షణ ఇస్తూ ప్రోత్సహించారు. నాలుగేళ్ల క్రితం సుమిత్.. మూడేళ్ల క్రితం అమిత్ .. సైక్లింగ్ అకాడమీకి ఎంపికై హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నారు.

చదువుతో పాటు సాధన

అకాడమీలో శిక్షణ పొందుతూనే చదువుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో సుమిత్ ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా అమిత్ 10వ తరగతి చదువుతున్నాడు. ఉదయం, సాయంత్రం అకాడమీలో సాధన చేస్తూ పగలు తరగతులకు హాజరవుతున్నారు. సుమిత్ ఇప్పటి వరకు నాలుగుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. షిర్డీ, గువహటి, హరియాణా, కేరళలో జరిగిన జాతీయ సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అమిత్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. విజేతగా నిలిచారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయి ట్రాక్ సైకిల్ పోటీలు నిర్వహించారు. అండర్-16 విభాగంలో ఇద్దరూ పాల్గొన్నారు. సుమిత్ ప్రథమ స్థానంతో బంగారు పతకం, అమిత్ ద్వితీయ స్థానంతో రజతం గెల్చుకున్నారు. భవిష్యత్తులో అగ్రశ్రేణి సైక్లిస్టుగా ఎదిగి అంతర్జాతీయ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తమ లక్ష్యమని అన్నాదమ్ములిద్దరూ తెలిపారు. సాధన చేసేందుకు తమకు సరైన సైకిళ్లు లేవని, జాతీయ స్థాయి పోటీల్లో వెనుకబడుతున్నామన్నారు.

ఆకాశంలో సగం.. సాగు భూమిలో లేరు!

మహిళల పేరు మీద 1.20 లక్షలు పట్టాలు మాత్రమే



జిల్లా జనాభా	10,12,065
పురుషులు	5,04,141
మహిళలు	5,07,924
మొత్తం రైతులు	3,24,141
మహిళా రైతులు	1,20,000
సాగు భూమి	7,01,902 ఎకరాలు
సాగు చేస్తోంది	5,05,590 ఎకరాలు

న్యూస్‌టుడే, గజ్వేల్, సిద్దిపేట: ఆకాశంలో సగమని అందరూ చెబుతారు. జిల్లాలోని సాగు భూమి పట్టాదారు రికార్డుల్లో మాత్రం పురుషుల సంఖ్యలో సగమైనా లేకపోవడం గమనార్హం. వనితలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న కొంగొత్త ఆధునిక మార్పులను సైతం అవగాహన చేసుకొని సాగు పనులు చేసుకోగలుగుతారు. పొలాల్లో నాగలి దున్నకం, ట్రాక్టర్ నడపడం లాంటి పనులు తప్ప మిగతావన్నీ నాటు, కలుపు, ద్రావణం పిచికారీ, ఎరువు చల్లడం, కోత, పత్తి ఏరడం, వాహనాల్లోకి ఎక్కించడం, అనుబంధాలైన పాడి, కూరగాయలు తదితర వ్యవసాయ ప్రక్రియలన్నీ చేపడుతున్నారు. పదేళ్ల క్రితం వరకు మహిళకు భూమిపై హక్కు కల్పించడం అరుదు. తర్వాత ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను పొందేందుకు, ఎక్కువ భూమి ఉంటే సీలింగ్ వస్తుందన్న ఉద్దేశంతో ఆడవాళ్లకు భూములను బదలాయించారు. అతివల పేరుపై భూరికార్డులొచ్చాయి. జనాభాలో వారి సంఖ్య ఎక్కువగా ఉన్న భూమి హక్కుల్లో మాత్రం తక్కువగా ఉన్నారు.

ఇంతికి ఇందుకే..

భూమి ఇంతి పేరున ఉంటే కుటుంబానికి, యజమానికి కొన్ని ప్రయోజనాలు వస్తాయి. అందుకే ఆడవారి పేరు మీద తప్పనిసరై భూమి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ● బ్యాంకుల్లో ఇంటి రుణాలు ● వాహనాలు, ఇతరత్రా అప్పులు ● పట్టా పాసు పుస్తకం ఉంటే తక్కువ వడ్డీ వస్తుంది ● వ్యవసాయ పరపతి సహకార సంఘంలో రాజకీయ పదవులు పొందేందుకు రైతు అయి ఉండాలనే నిబంధన ● రైతు బీమా.

నిర్వాసితులను ఆదుకోవాలి: సీపీఐ



న్యూస్‌టుడే, హుస్నాబాద్: గౌరవెల్లి రిజర్వాయరులో ముంపునకు గురైన భూ నిర్వాసితులకు రావాల్సిన పరిహారం వెంటనే చెల్లించాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. హైదరాబాద్‌లో గురువారం నీటిపారుదలశాఖ ముఖ్య సలహాదారు ఆదిత్యానాథ్‌దాస్, ఈఎన్సీ అనిల్‌కుమార్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందచేశారు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.నర్సింహ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అందె స్వామి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉన్నారు.

ఆలయాల చోరీల్లో ఆరితేరారు..

ఇద్దరు నిందితుల రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి


న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: ఆరు ఆలయాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్న ముఠా సభ్యుల్లోని ఇద్దరిని పోలీసులు పట్టుకొని రిమాండుకు తరలించారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. వివరాలను గజ్వేల్‌లో ఏసీపీ పురుషోత్తంరెడ్డి గురువారం వెల్లడించారు. కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారి మంగోల్ క్రాస్‌రోడ్ వద్ద బుధవారం తమ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా గజ్వేల్ పట్టణానికి చెందిన పర్వతం నర్సింలు, మోతె పరశురాములు ఇద్దరూ అనుమానాస్పదంగా కనిపించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని ఆపి పరిశీలించగా చోరీ వస్తువులు కనిపించాయి. వారిని పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి విచారించగా వివిధ ఆలయాల్లో చోరీలు చేసినట్లు నేరం అంగీకరించారు. కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడు ఆలయాలు, రాయపోల్ మండలం పెద్ద ఆరెపల్లి పెద్దమ్మ దేవాలయం, గజ్వేల్ పాండవుల చెరువుపై హనుమాన్ గుడి, చిన్నకోడూరు పరిధిలో మరోటి.. మొత్తం ఆరు ఆలయాల్లో హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. గుళ్లలోని పంచలోహ విగ్రహాలు, మైక్‌సెట్, బంగారు ముక్కుపుడక, వెండి నుదుటి బొట్లను దొంగలించారు. చోరీకి గురైన ఆభరణాలు, నగదు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులను ఛేదించిన సిబ్బందిని సీపీ అనూరాధ అభినందించి రివార్డులు ప్రకటించారు. సమావేశంలో సీఐలు సైదా, ముత్యంరాజు, లతీఫ్ ఉన్నారు.

గోదావరి ఆలంబనతో అరటి పెంపకం



గోదావరి నీటికి అరటి తోటలకు అవినాభావ సంబంధం ఉంది. జిల్లాలోని కొన్ని చోట్ల అరటిని పెంచుతున్నారు. కాలువలో గోదావరి జలాలు.. గట్టున పచ్చటి పైరు పక్కనే అరటి చెట్ల పెంపకం ఆహ్లాదాన్ని పంచుతోంది. కొండపోచమ్మసాగర్ నుంచి గజ్వేల్ శివారు మీదుగా రామాయంపేటకు వెళ్లే కాలువ పక్కన రైతులు నీటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

పచ్చని గుట్టకు బొట్టు రాయి



కోహెడ మండలంలోని గుండారెడ్డిపల్లి నుంచి తంగళ్లపల్లి వెళ్లే దారిలో గిన్నె గుట్ట (గండ్లె) మీద బండ రాళ్లు పొందిగ్గా కూచున్నట్టుగా కనిపిస్తూ ఆకర్షిస్తున్నాయి. చుట్టూ పచ్చని చెట్లతో గుట్ట, పైన పేర్చినట్టుగా స్థిరమైన బండరాళ్లు.. ప్రకృతిని సింగారించినట్టుగా కనువిందు చేస్తున్నాయి. – న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

పాలిటెక్నిక్ కళాశాలలో వసతులపై ఆరా



వివరాలు సేకరిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, సిబ్బందితో విడివిడిగా సమావేశం ఏర్పాటు చేసి విద్యా బోధన తీరు, వసతులు, సౌకర్యాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఉన్నారు. రాత్రి కళాశాల వసతిగృహంలో విద్యార్థులతో కలిసి బస చేశారు.

నాణ్యత పగుళ్ల పాలు!

కంకర తేలి నడిచేందుకు ఇబ్బందులు



పగుళ్లు ఇచ్చిన రాజిరెడ్డిపల్లి సీసీ రోడ్డు

న్యూస్‌టుడే, గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా పురపాలికలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టినా వాటి నాణ్యత తేలిపోతోంది. సీసీ రోడ్లు పగుళ్లిచ్చి, కంకర బయల్పడుతోంది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నరకే రోడ్లు దెబ్బతిన్నాయి. నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2012లో నాలుగు గ్రామ పంచాయతీల విలీనంతో ఏర్పాటైన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియాలో 20 వార్డులున్నాయి. సుమారు 11 వేలకుపైగా నివాసాలు, 55 వేల జనాభా ఉంది. నియోజకవర్గ కేంద్రం కావటంతో ప్రధాన శాఖల డివిజన్ కార్యాలయాలతో బల్దియాలో ఎప్పుడూ వాహనాల రద్దీ, జన సంచారం ఉంటుంది. వివిధ మండలాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, పరిశ్రమల్లో కార్మికులు, వ్యాపారులు ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యార్థం బల్దియాలో ప్రాధాన్యక్రమంలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించారు. మొదటి విడతగా 2023లో గత ప్రభుత్వం గడా ద్వారా రూ.22.83 కోట్లు మంజూరు చేశారు. ఒక్కో వార్డులో ఐదు రోడ్లకు తగ్గకుండా సీసీలు నిర్మించారు. కొన్ని చోట్ల పూర్తి కాగా పలు చోట్ల చేపడుతున్న పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ రోడ్లు ప్రస్తుతం శిథిలమవుతున్నాయి.

ఎక్కడెక్కడ?

రాజీవ్‌పార్కు నుంచి రాజిరెడ్డిపల్లి కాలనీకి వెళ్లే దారి సీసీ చాలాచోట్ల పగుళ్లిచ్చింది. కంకర తేలింది. గుంతలు పడ్డాయి. గజ్వేల్ ఆఫీసర్ కాలనీ, నాలుగో వార్డులోనూ ఇదే పరిస్థితి ఉంది. పది కాలాలపాటు పటిష్ఠంగా ఉండేలా సిమెంటు, ఇసుక, కంకర మిశ్రమాన్ని ఉపయోగించాల్సిన గుత్తేదారులు ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాడైన చోట్ల మరమ్మతులు చేయించటంతో పాటు సాగుతున్న పనులను పటిష్ఠంగా చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై బల్దియా ఛైర్మన్ రాజమౌళి దృష్టికి తీసుకుపోగా నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు చేయిస్తున్నామన్నారు. ఎక్కడైనా దెబ్బతింటే గుత్తేదారుతోనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

ప్రభుత్వం పట్టించుకోవాలి: సీపీఎం

గజ్వేల్: మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి, సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ డిమాండు చేశారు. గురువారం వారు గజ్వేల్‌లో వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిపెట్టడం లేదన్నారు. నిర్వాసితులు సమస్యలతో సహవాసం చేస్తున్నారని వాపోయారు.

రుణ సహకారం.. అభ్యున్నతికి దోహదం

మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తున్న డీసీసీబీ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిందే డీసీసీ బ్యాంకు. కర్షకులకు రుణాలు ఇస్తూ, వాటిని వసూలు చేస్తుంటుంది. అయితే ఇటీవల కాలంలో డీసీసీబీ తన పంథాను మార్చుకొని ముందుకు సాగుతోంది. మహిళలకూ సహకారం అందిస్తోంది. ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించడంలోనూ ముందుంటోంది. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సంఘాలకు రుణాల అందిస్తోంది. వసూలైన వడ్డీలో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లిస్తోంది. ఈ విషయంలో రాష్ట్రంలోనే మెదక్ డీసీసీబీ ముందంజలో నిలవడం విశేషం.

రాష్ట్రంలో మొత్తం తొమ్మిది డీసీసీబీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏర్పాటుచేశారు. వీటి ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా రూ. 440.01 కోట్లు పంపిణీ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణ పంపిణీలో రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచి ప్రభుత్వ పురస్కారం అందుకుంది. ఈ సారి కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. నాబార్డు సహకారంతో మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తోంది.

ఐదేళ్లలో మహిళా సంఘాలకు అందించింది..

సంవత్సరం	రుణాల పంపిణీ (రూ.కోట్లలో)
2020-21	309.09
2021-22	325.40
2022-23	393.56
2023-24	420
2024-25	440.11

(అక్టోబరు 20 వరకు)

బీమాపై అవగాహన

ప్రధానమంత్రి బీమా పథకాలను మహిళా సంఘాల సభ్యులకు అమలు చేస్తున్నారు. ఏడాదికి రూ. 12 చెల్లిస్తే ప్రమాద బీమా, రూ. 330తో సాధారణ బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ప్రమాద బీమా చేసుకున్న వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 2 లక్షలు, సాధారణ బీమాలో చేరిన వారు ఆత్మహత్య మినహా ఎలా మృతిచెందినా రూ. 2లక్షలు, రెండింటిలో చేరితే రూ. 4లక్షలు సాయం అందిస్తారు. సభ్యులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నారు.

రూ.2 లక్షలు తీసుకొని..



సంగారెడ్డి జిల్లా సంగుపేటకు చెందిన వజ్రమ్మ.. స్థానిక చైతన్య పొదుపు సంఘంలో సభ్యురాలు. 12 ఏళ్లుగా పొదుపు చేస్తూ వస్తున్నారు. డీసీసీబీ నుంచి రూ. 2 లక్షల రుణం తీసుకొని.. కిరాణా దుకాణం, టీ హోటల్ నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణతో వస్తున్న మొత్తాన్ని కుటుంబ పోషణకు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా బ్యాంకు అధికారులకు క్రమం తప్పకుండా రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. - న్యూస్‌టుడే, జోగిపేట

5 శాతం తిరిగి చెల్లింపు

స్వయం సహాయక సంఘాలకు 12 శాతం వడ్డీపై రుణాలు అందిస్తున్నారు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆయన చొరవతో డీసీసీబీ పరిధి సంగారెడ్డి జిల్లాలోని సంఘాలకు వడ్డీలో 5 శాతం తిరిగి చెల్లిస్తున్నారు. 2020 జులైలో ఇది మొదలైంది. ఈ మొత్తాన్ని సంఘాల అభ్యున్నతికి వెచ్చిస్తున్నారు. ఇప్పటివరకు రూ. 1.50 కోట్లు జిల్లా సమాఖ్యకు అందజేయడం గమనార్హం. ఇలా వెనక్కి ఇచ్చిన వడ్డీలో ఒక శాతం జిల్లా సమాఖ్య, 2 శాతం మండల సమాఖ్యలకు, మిగతాది గ్రామైక్య సంఘాలకు కేటాయిస్తున్నారు.

నాటు కోళ్ల పెంపకంతో..



మెదక్ జిల్లా చేగుంట మండలం గొల్లపల్లి జైత్రాం తండాకు చెందిన నవ జ్యోతి మహిళా సంఘానికి చెందిన లక్ష్మి డీసీసీబీ నుంచి రూ. 1.5 లక్షల రుణం తీసుకున్నారు. నాలుగు నెలల కిందట కోడి పిల్లల పెంపకాన్ని చేపట్టారు. 2,500 నాటు కోడి పిల్లలు తీసుకొచ్చి. . ఒక్కోటి 250 గ్రా. బరువు కాగానే విక్రయిస్తున్నారు. తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, చేగుంట

సందడిగా ఎంపిక పోటీలు



క్రీడాకారులతో నాగరాజు, నగేష్, వంశీ, వినయ్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: త్వరలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు సూచించారు. గురువారం మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సిద్దిపేట, గజ్వేల్, సంగారెడ్డి, మెదక్, సదాశివపేట, జహీరాబాద్‌కు చెందిన 120 మంది పాల్గొన్నారు. జట్లుగా విభజించి పోటీలు కొనసాగించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఎం.అరుణ్ దినకరన్, శ్రీకాంత్, ఎం.డి. సొది, ఎం.జాన్‌పాల్‌లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 25 నుంచి 30 వరకు హైదరాబాద్ జింఖానా మైదానంలో జరిగే శిక్షణ శిబిరానికి హాజరుకానున్నారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, సెలక్షన్ కమిటీ మెంబర్ నగేష్, ఫుట్‌బాల్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, వినయ్, శిక్షకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

అఖిలభారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


చేగుంట: అఖిల భారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు మెదక్ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు శిక్షకుడు కరణం గణేష్‌రవికుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో జరిగిన విశ్వవిద్యాలయాల కత్తిసాము పోటీల్లో ఫాయిల్ విభాగంలో కరణం నిశాంత్, ఈపీ విభాగంలో శ్రీశాంత్, ముఖేష్, సాబేర్‌లో జవదుద్దీన్, ఈపీలో రాజేశ్వరిలు ప్రతిభ చూపారు. వీరు నవంబరు 6 నుంచి 10 వరకు జమ్ములోని యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

27న స్వేరోస్ జాతీయ సభ

బెజ్జంకి, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఈ నెల 27న నిర్వహించే స్వేరోస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బలుగూరి దుర్గయ్య కోరారు. గురువారం బెజ్జంకిలో కమిటీ నాయకులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. సభకు స్వేరోస్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో హాజరయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మహనీయుల ఆశయాల సాధనతో పాటు విద్యార్థుల ఉజ్వల భవితకు స్వేరోస్ కమిటీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, ప్రకాశ్, కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మారుతి, జిల్లా అధ్యక్షుడు బాబు, రాష్ట్ర నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ప్రేమ విఫలమైందని యువకుడు..



విశ్వసాయి

సిద్దిపేట టౌన్: ప్రేమ విఫలమై ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన బోదనకారి విశ్వసాయి (22) మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్నాళ్లకు వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. బుధవారం రాత్రి విశ్వసాయి బయటకు వెళ్లాడు. కోమటిచెరువులో దూకి చనిపోతున్నానంటూ మిత్రులకు చరవాణిలో సందేశం పంపించాడు. వారు యువకుడి కుటుంబసభ్యులకు చేరవేశారు. వారు అక్కడికి చేరుకునేసరికి చెరువులో దూకాడు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెతికి మృతదేహాన్ని వెలికితీశారు. తల్లి జయమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక ఇబ్బందులతో అన్నదాత..



మహేందర్

చేర్యాల: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని మర్రిముచ్చాలకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి(56), సత్యలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. అకాల వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకగా నష్టపోయాడు. రూ.2.01 లక్షల రుణమాఫీ కాలేదు. దీంతో మనస్తాపం చెందాడు. గురువారం భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. పంటకు పురుగు మందు పిచికారీ చేశాడు. భార్యను అక్కడే వదిలేసి ఇంటికొచ్చి పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే చనిపోయాడని తేల్చారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మద్యం తాగొద్దన్నందుకు రైతు..



శ్రీనివాస్

దుబ్బాక: మద్యం తాగొద్దని కుటుంబీకులు చెప్పడంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు.. పెద్దగుండవెల్లికి చెందిన పంజ శ్రీనివాస్ (49)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం అతడికి గుండె శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి మందులు వాడుతూనే రోజూ మద్యం తాగుతున్నాడు. ఈ నెల 22న రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. కుటుంబీకులు నిలదీయగా గొడవ పడడు. బుధవారం తెల్లవారుజామున పొలం వద్ద కొట్టంలోకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబీకులు 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాజమణి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుటుంబ కలహాలతో..



నర్సింహులు

మాసాయిపేట (చేగుంట): కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. చేగుంట ఠాణా పరిధి మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్టతండాకు చెందిన నర్సింహులు (45), శాంతి దంపతులకు ముగ్గురు కుమారులు. కొంతకాలంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన నర్సింహులు బుధవారం రాత్రి పొలం వద్ద ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబీకులు లేచి చూసేసరికి కనిపించకపోవంతో అంతటా వెతికారు. పొలం వద్ద విగతజీవిగా కనిపించాడు. కేసు నమోదైంది.

చికెన్ ధరలు				
	ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
	రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

ఆచరణలో ఆదర్శం.. స్వచ్ఛతలో మేటి

● సిద్దిపేటకు కితాబిచ్చిన 11 పురపాలికల అధికారులు



డీఆర్‌సీసీ కేంద్రం సందర్శనలో..

సిద్దిపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛతలో సిద్దిపేట బల్దియా ఆచరణాత్మకంగా, ఆదర్శంగా నిలిచిందంటూ రాష్ట్రంలోని వివిధ పురపాలికల కమిషనర్లు, అధికారులు కితాబునిచ్చారు. తడి, పొడి, హానికర చెత్త నిర్వహణలో మేటిగా మారిందంటూ ప్రశంసించారు. గురువారం రాష్ట్రంలోని 11 పురపాలికల కమిషనర్లు, అధికారులు సిద్దిపేటలో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలు తెలుసుకున్నారు. బల్దియా అధ్యక్షురాలు మంజుల, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, అధికారులు.. ఇక్కడి ప్రత్యేకతలను వివరించారు. తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా సేకరణ తీరును తెలుసుకున్నారు. గృహ యజమానులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను పలకరించారు. బుస్సాపూర్‌లో సీఎన్‌జీ (బయో గ్యాస్) ప్లాంట్, ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), డీఆర్‌సీసీ (పొడిచెత్త వనరుల సేకరణ కేంద్రం)ని పరిశీలించారు. స్వచ్ఛబడి విశేషాలు తెలుసుకున్నారు. కోమటిచెరువును సందర్శించారు. వైస్ ఛైర్మన్ కనకరాజు తదితరులు ఉన్నారు. చేర్యాల, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, జనగాం, నర్సంపేట, వర్ధన్నపేట, సిరిసిల్ల, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ పురపాలికల బృందాలు సందర్శించాయి. రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిన మున్సిపాలిటీలను ఎంపిక చేశారని, వాటిలో సిద్దిపేట ఒకటని కమిషనర్ తెలిపారు. 46 పురపాలికల అధికారులు వస్తారన్నారు.

పీహెచ్‌సీలో యువకుడి దారుణ హత్య



వివరాలను సేకరిస్తున్న క్లూస్‌టీం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన చిన్నశంకరంపేటలో గురువారం జరిగింది. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తెరిచేందుకు గురువారం ఉదయం వైద్య సిబ్బంది, మండల వైద్యాధికారిణి సాయిసింధూ వెళ్లారు. ఆసుపత్రి వెనుకభాగంలో ఉన్న తలుపు తీయగానే ఓ యువకుడు రక్తం మడుగులో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై నారాయణ ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. తెల్లవారు జామున దుండగులు బండరాయితో యువకుడిపై దాడి చేసి, ఇష్టానుసారం కొట్టి హతమార్చారు. అనంతరం మొక్కల రక్షణకు ఉంచిన ట్రీగార్డులను మృతదేహంపై వేసి దహనం చేసేందుకు ప్రయత్నించారు. ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మండల వైద్యాధికారిణి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని, యువకుడి వివరాలు తెలియాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న పీహెచ్‌సీలో ఈ ఘటన జరిగింది. దీంతో పట్టణ వాసులు భయాందోళనకు గురయ్యారు.

అనంతగిరి.. పక్షుల లోగిలి



న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ: వికారాబాద్ అనంతగిరిలో పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు మనసుదోచే ఆహ్లాదకర వాతావరణంతో పాటు వివిధ రంగుల్లో పక్షులు దర్శనమిచ్చి ప్రకృతి సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. అనంతగిరిలో మొత్తం 228 పక్షులు తలదాచుకుంటున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. వింత శబ్దాలు చేస్తుంటే సందర్శకులకు అక్కడి నుంచి వెళ్లాలనిపించదు. పక్షి ప్రేమికులు హైదరాబాద్ బర్డ్స్ అసోసియేషన్ వారు ప్రతి సంవత్సరం అనంతగిరి సందర్శించి పక్షుల చిత్రాలు తీస్తుంటారు. పాలపిట్ట, బ్లాక్‌డ్రోంగో, డవ్, రోజ్ బర్డ్ తదితర పక్షులు అడవిలో అలరిస్తున్నాయి. పక్షుల వివరాలు తెలుసుకునేందుకు నడకదారిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే కనిపిస్తాయని సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



నాగరాజు

రామాయంపేట: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని ఝాన్సీలింగాపూర్‌కు చెందిన నాగరాజు (36), లత దంపతులకు ముగ్గురు సంతానం. నాగరాజు తనకున్న రెండెకరాలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లగా, పంటకు నీరు పారించాలని మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ డబ్బా వద్దకు వెళ్లాడు. ఫ్యూజ్ సరిచేసే క్రమంలో విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదైంది.

చేపలవేటకు వెళ్లి..



సర్వాల్‌సింగ్

కుల్కచర్ల, న్యూస్‌టుడే: చేపలు పట్టేందుకు కుంటకు వెళ్లిన వ్యక్తి అందులోనే మునిగి మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సర్వాల్‌సింగ్ (36) ఇనుప సామాన్ల దుకాణంలో కూలీ. గురువారం స్థానిక కుంటలో చేపలను పట్టేందుకు వెళ్లాడు. ఈత రాకున్నా.. స్నానం చేసేందుకు అందులోకి దిగుతుండగా అతడి బంధువు వారించాడు. అయినా వినకుండా దిగి నీటమునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు కుమారులున్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ..

అల్లాదుర్గం: రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని సీతానగర్‌కు చెందిన వెంకయ్య (60), తులసమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకయ్య గురువారం పెద్దశంకరంపేటలో జరిగిన వారాంతపు సంతకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాగయ్య ఆటో ఎక్కాడు. మార్గమధ్యలో రాంపూర్ శివారులో రాగానే ఆటో బోల్తాపడి ఉంది. ఈ ఘటనలో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవరు నాగయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రుడిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియరాలేదు. ఘటనాస్థలిలో ట్రాక్టరు వెళ్లిన ఆనవాళ్లు ఉన్నాయని, అది తగిలి ఆటో బోల్తా పడొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పాదచారిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



కరుణాకర్

వర్గల్: ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా శునకం అడ్డు రాగా అదుపు తప్పి.. రోడ్డు దాటుతున్న మరొకరిని ఢీకొట్టగా.. ద్విచక్రవాహనదారులు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వర్గల్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన నీల కరుణాకర్(29) వంటిమామిడి సమీపంలోని ఓ కంపెనీలో ఉద్యోగి. బుధవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికెళ్తున్నాడు. రాజీవ్ హదారిపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో రోడ్డు దాటుతున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్‌ను బైక్‌తో ఢీకొట్టాడు. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కరుణాకర్ పరిస్థితి విషమించడంతో లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కరుణాకర్ సోదరుడు శేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుమారుడికి అన్నీ తానై తల్లి అంత్యక్రియలు



దుబ్బాక, న్యూస్‌టుడే: చేతికొచ్చిన కొడుకు అండగా ఉంటాడనుకుంది. కానీ అనారోగ్యంతో మృతిచెందడంతో తల్లి అంత్యక్రియలు నిర్వహించిన హృదయ విదారక ఘటన దుబ్బాకలో గురువారం చోటుచేసుకుంది. వివరాలివీ.. 13వ వార్డుకు చెందిన బెల్లె రాజవ్వకు ఇద్దరు కూతుళ్లు(వివాహాలు జరిగాయి), ఒక కుమారుడు. రాజవ్వ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు కనకరాజు(25) కూలీ పని చేస్తూ తల్లిని పోషించేవాడు. మూడు నెలలుగా తీవ్ర అనారోగ్యం బారిన పడి బుధవారం రాత్రి ములుగు ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా తల్లి అంత్యక్రియలు నిర్వహించింది. తోడుగా ఉంటాడనుకున్న కుమారుడికి కన్న తల్లి అంత్యక్రియలు చేపట్టడం స్థానికులను కలచివేసింది.

కలగన్నారు.. ఖాకీ ధరించారు!



రికార్డులు తనిఖీ చేస్తున్న శిక్షణ ఎస్సై హారిక

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

పోలీసు యూనిఫాం ధరించాలనేది వారి కల.. కష్టాలకు ఎదురీది దాన్ని నిజం చేసుకున్నారు. సంకల్పం, పట్టుదల ఉండాలే ఖాకీ దుస్తులు ధరించడం కష్టమేమి కాదని నిరూపించారు ఈ ముగ్గురు యువ మహిళా ఎస్సైలు. పోలీసు నియామక పరీక్షలో ఉద్యోగాలు సాధించి సంగారెడ్డి జిల్లాలో సబ్ ఇన్‌స్పెక్టర్ శిక్షణలో ఉండటం విశేషం.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో శిక్షణ ఎస్సైలుగా వికారాబాద్ జిల్లాకు చెందిన ఎ.హారిక, డి.కావేరి, హిమబిందు నెల రోజుల శిక్షణ పొందుతున్నారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ నిర్వహించే విధులు సహా పెట్రోలింగ్, బ్లూకోల్ట్, పగలు, రాత్రి వేళల్లో వాహన తనిఖీలు, కోర్టు విధులు, నేరాలు జరిగినప్పుడు స్పందించాల్సి విధానంపై అవగాహన పెంచుకుంటున్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌లోని ఎస్సైల సహకారంతో విధులు, బాధ్యతలు తెలుసుకుంటున్నారు.

యూనిఫామ్‌పై మక్కువతో..

నా పేరు ఎరువ హారిక. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం చీమలదరి స్వగ్రామం. అమ్మ బాలమణి టైలర్, నాన్న శేఖర్ ప్రైవేటు పరిశ్రమలో పని చేసున్నారు. వారు కష్టపడి నన్ను పీజీ చదివించారు. తమ్ముడు సూర్యకిరణ్ ఫ్లయింగ్ అధికారిగా పనిచేస్తున్నాడు. పోలీసు యూనిఫామ్ ధరించాలని చిన్నపటి నుంచి కోరిక. టీజీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతుండగా ఎస్సైల భర్తీ ప్రకటన వచ్చింది. ఓ సారి ప్రయత్నిద్దామని దరఖాస్తు చేశా. తొలి ప్రయత్నంలోనే అవకాశం దక్కింది. మా కుటుంబంలో నేనే తొలి ప్రభుత్వ ఉద్యోగిని కావడం ఆనందంగా ఉంది.

ఉపాధ్యాయురాలు కావాలనుకొని..



నా పేరు దూది కావేరి. మాది వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం గాంధీచౌక్ ప్రాంతం. అమ్మ నిర్మల గృహిణి, నాన్న వీరేశం సెక్యూరిటీ సూపర్‌వైజర్, అన్నయ్య భానుప్రసాద్. పాఠశాల విద్యను తాండూరులోని శిశు మందిర్, ఇంటర్ హైదరాబాద్‌లో చదివా. డీఈడీ టీచర్ శిక్షణ పూర్తి చేశా. అనంతరం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశా. ఉపాధ్యాయురాలు కావాలని టీటీసీ పూర్తి చేసినా.. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం వచ్చింది.

గ్రూప్స్‌కి సిద్ధమవుతుండగా..



నా పేరు నాంచెరి హిమ బిందు. వికారాబాద్ పట్టణం పులుసు మామిడి స్వగ్రామం. నాన్న రాంరెడ్డి జీహెచ్ఎంసీ ఉద్యోగి, అమ్మ లక్ష్మి గృహిణి. తమ్ముడు హర్షవర్ధన్‌రెడ్డి సివిల్స్ శిక్షణ పొందుతున్నాడు. నర్సాపూర్ బీవీఆర్ఐటీలో ఈఈఈ పూర్తి చేయగా ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం వచ్చింది. దాన్ని కాదనుకొని గ్రూప్స్ సాధించాలని సిద్ధమయ్యా. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ప్రయత్నించా. తొలి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగం సాధించా. లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే సాధించడం కష్టమేమి కాదు.

ఆత్మరక్షణ విద్యకు వెన్నుదన్ను

రూ.15వేల చొప్పున నిధుల మంజూరు

న్యూస్‌టుడే, సిద్దిపేట, హుస్నాబాద్ గ్రామీణం, చేగుంట, వికారాబాద్ కలెక్టరేట్

నిత్యం మహిళలు, బాలికలపై ఎక్కడో ఓ చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు బాలికలకు ఆత్మవిశ్వాసం పెరిగేలా, స్వీయరక్షణకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఆత్మరక్షణ విద్య కరాటే నేర్పిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేసింది. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు పాఠశాలలను ఎంపిక చేయగా, నిర్దేశించిన కాలంలో శిక్షణ ఇవ్వనున్నారు.



కరాటే నేర్చుకుంటున్న బాలికలు

879 పాఠశాలల్లో..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో రాణి లక్ష్మి బాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ పేరిట కరాటే సాధన చేయించనున్నారు. ఇందుకు ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా పాఠశాలలను ఎంపిక చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగు జిల్లాల్లోని 699 పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తున్నారు. నవంబరు నుంచి మూడు నెలల పాటు దీన్ని కొనసాగిస్తారు. ఆయా ప్రాంతాలకు చెందిన శిక్షకులను నియమించారు.

కరాటే శిక్షణకు ఎంపిక ఇలా..

	పాఠశాలలు	నిధులు(రూ.లక్షల్లో..)
మెదక్	191	28.65
సంగారెడ్డి	250	37.50
సిద్దిపేట	258	38.71
వికారాబాద్	180	27.00

వారానికి రెండు తరగతులు

శిక్షకులకు సొంత మండలంలోని పాఠశాలల బాధ్యత అప్పగించారు. వీరు వారానికి రెండు తరగతుల చొప్పున ఆత్మరక్షణ విద్య నేర్పిస్తారు. నెలకు రూ. 5 వేల చొప్పున వేతనం చెల్లిస్తారు ఒక్కో పాఠశాలకు రూ. 15 వేల చొప్పున మంజూరయ్యాయి.


నైపుణ్యాలు నేర్పిస్తాం:



పాఠశాలల్లో బాలికలకు కొన్నేళ్లుగా కరాటే నేర్పిస్తున్నా. ఎవరైనా దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తూ సొంతంగా రక్షించుకునేలా విద్య నేర్పిస్తున్నాం. దీని ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ధైర్యంగా వెళ్లగలుగుతారు.

ఘాక్యా రమేశ్, కరాటే శిక్షకుడు

వచ్చే నెల 1 నుంచి..:



కరాటే శిక్షణకు నిధులు మంజూరయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కూడా పూర్తయింది. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయి. నవంబరు 1 నుంచి నిధులు మంజూరైన అన్ని పాఠశాలల్లో శిక్షణ ప్రారంభిస్తాం. బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా అవసరం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని నింపుతుంది.

శ్రీనివాసరెడ్డి, సిద్దిపేట డీఈవో

చార్మినార్ జోన్ పరిధిలో విలీనం చేయాలి


టీజీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు వినతిపత్రం అందజేత

సిద్దిపేట: సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో విలీనం చేయాలని టీజీవో జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కొమ్ముల విక్రంరెడ్డి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌హుస్సేన్‌కు గురువారం విన్నవించారు.

యువకుల శ్రమదానం

కొండపాక గ్రామీణం: అంకిరెడ్డిపల్లి నుంచి దుద్దెడ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలను గురువారం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు శ్రమదానం చేసి తొలగించారు. రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో యువకులే ముందుకొచ్చి తొలగించారు. యువకులు చందు, రవి, రాజు, సంజీవ్, మధు, రమేష్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ మహా సమ్మేళనం విజయవంతానికి పిలుపు

గజ్వేల్: గజ్వేల్‌లో నవంబరు 3న నిర్వహించ తలపెట్టిన ధర్మ సమాజ్‌పార్టీ మహా సమ్మేళనం విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు కోరారు. ఈ మేరకు ఇందుకు సబంధించిన ప్రచార కరపత్రాలను గురువారం రాత్రి ఆయన గజ్వేల్‌లోని అంబేడ్కర్ కూడలిలో ఆవిష్కరించారు.

సార్లొచ్చారు.. బడులు తెరుచుకున్నాయి

● డీఎస్సీ నియామకాలతో తిరిగొచ్చిన విద్యార్థులు

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలంలో మూతపడిన రెండు పాఠశాలలు ఎట్టకేలకు తెరుచుకున్నాయి. డీఎస్సీ-2024 నియామకాలతో ఉపాధ్యాయులు రావడమే కారణం. దీంతో ఇన్నాళ్లు విద్యార్థులు లేక బోసిపోయిన ఆ పాఠశాలలు ప్రస్తుతం కళకళలాడుతున్నాయి.


చౌడుతండాలో ఉపాధ్యాయురాలు రమాదేవి

అక్కన్నపేట మండలంలోని చౌడుతండా, మోత్కులపల్లి పెద్దతండాలోని ప్రాథమిక పాఠశాలలు గత విద్యాసంవత్సరం వరకు బాగానే నడిచాయి. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు లేరనే సాకుతో రెండింటిని మూసివేశారు. చౌడుతండాలో పని చేసిన ఇద్దరు ఉపాధ్యాయులు, పెద్దతండాలో పని చేసిన ఒక ఉపాధ్యాయుడు బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లారు. దీంతో రెండు తండాల్లోని విద్యార్థుల్లో కొందరు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లగా మరికొందరు సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేరి చదువుకుంటున్నారు. బదిలీల్లో భాగంగా ఈ రెండు పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు తాము పని చేస్తున్న స్థానం నుంచి రిలీవ్ కాలేదు. వారి స్థానంలో ఇతర బడుల నుంచి రాకపోవడం ఒక కారణం.

బాధ్యతలు చేపట్టడంతోనే..

డీఎస్సీ-2024 నియామకాల్లో భాగంగా ఎంపికైన కొత్త టీచర్లకు ఇటీవల పోస్టింగులు ఇచ్చారు. బదిలీ అయినప్పటికీ పాత స్థానాల్లోనే పని చేస్తున్న వారి స్థానాల్లో కొత్తవారికి కేటాయించారు. దీంతో స్థానచలనం అయిన టీచర్లను రిలీవ్ చేసి తమకు కేటాయించిన స్థానాల్లో చేరారు. ఇందులో భాగంగా పంతులుతండా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు రమాదేవి చౌడుతండాకు, ఇతర బడుల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు రఫీ, పద్మ పెద్దతండా పాఠశాలకు వెళ్లి బాధ్యతలు చేపట్టారు. వీరి రాకతో ప్రైవేటుతో పాటు ఇతర స్కూళ్లకు వెళ్తున్న విద్యార్థులంతా తిరిగివచ్చారని ఎంఈవో గుగులోతు రంగ తెలిపారు.


పెద్దతండా పాఠశాలలో ఉపాధ్యాయులు రఫీ, పద్మ

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053, జగదేవపూర్ 8008573209, హుస్నాబాద్ 8008573520, దుబ్బాక 9030037175, చేర్యాల 8008574871, గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: ? దుద్దెడలో శంభు దేవాలయం వెళ్లే దారిలో సీసీ రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే పూడ్చాలి. – శ్రీనివాస్, దుద్దెడ

✓ గుంతను పూడ్చివేసి సమస్యను పరిష్కరిస్తాం. – చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి, దుద్దెడ

? కుకునూరుపల్లిలో మాంసం వ్యాపారులు వ్యర్థాలను బొబ్బాయిపల్లి, తిప్పారం వెళ్లే దారికి ఇరువైపులా పారబోస్తున్నారు. దీంతో సమీప ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. – అనిల్, కుకునూరుపల్లి

✓ మాంసం వ్యర్థాలు వేయకుండా ప్రజలను చైతన్య పరుస్తాం. చెత్తను డంపు యార్డుకు తరలిస్తాం. – స్వప్న, పంచాయతీ కార్యదర్శి, కుకునూరుపల్లి

? కోహెడ నుంచి తంగళ్లపల్లి వరకు ఇటీవల తారు రోడ్డు వేశారు. గతంలో ట్రాక్టర్ కేజీ వీల్స్ కారణంగా రోడ్డు మరమ్మతులకు గురైంది. మళ్లీ ఆ పరిస్థితి రాకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. – శ్రీకాంత్, తంగళ్లపల్లి

✓ ఆ మార్గంలో తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. – సాజిద్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కోహెడ

రహదారి పనులు ప్రారంభం

తొగుట, న్యూస్‌టుడే: తొగుట మండలం మెట్టు నుంచి మిరుదొడ్డి మండలం అల్వాల వరకున్న రహదారి పనులు నిధులు రాక అర్ధాంతరంగా ఆగిపోయాయి. మెట్టు నుంచి అల్వాల వరకు 12 కి.మీ. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన గుత్తేదారు మెట్టు నుంచి గుడికందుల వరకు 6.5 కి.మీ. పూర్తి చేసినా నిధులు రాకపోవడంతో పనులు నిలిపేశాడు. ఇదే విషయమై ఈనెల 17న 'ఈనాడు'లో 'ఆగిన పనులు... సాగేనా!' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెండు రోజుల క్రితమే గుడికందుల నుంచి అల్వాల వరకు రహదారి మరమ్మతులు ప్రారంభించారు.

ఈనాడు కథనాలకు స్పందన

శునకాల పట్టివేత షురూ..

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల పట్టణంలో శునకాల పట్టివేత ప్రారంభమైంది. ఈ నెల 22న 'గుంపుగా తిరుగుతూ.. దాడులు చేస్తూ..' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనరు నాగేందర్ స్పందించారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం శునకాల పట్టివేత కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు మొత్తం 15 కుక్కలను పట్టి సిద్దిపేట నియంత్రణ కేంద్రానికి తరలించినట్లు కమిషనరు తెలిపారు. మరి కొన్ని రోజుల పాటు ఈ కార్యక్రమం సాగుతుందన్నారు.

జీవో 29 ఉపసంహరించుకోవాలి

గజ్వేల్, న్యూస్‌టుడే: పంతాలు, పట్టింపులకు పోకుండా సీఎం రేవంత్‌రెడ్డి జీవో 29ను ఉపసంహరించుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండు చేశారు. గురువారం ఆయన గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. జీవో కారణంగా గ్రూప్-1 పరీక్షల్లో 5,300 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారని వాపోయారు.

కోతల సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: వరి కోతల సమయంలో హార్వెస్టర్ తక్కువ వేగంతో కోసినట్లయితే ధాన్యం కింద రాలకుండా నివారించవచ్చని ఏవో శ్రీనాథ్ పేర్కొన్నారు. మందపల్లిలో గురువారం వరి కోత పొలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కొండపాక గ్రామీణం, రాయపోల్, కోహెడ, కోహెడ గ్రామీణం, దౌల్తాబాద్, నంగునూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి గిట్టుబాటు ధర అందుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ దిలీప్‌నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం కొండపాక మండలం రవీంద్రనగర్, బందారందర్గా, జప్తినాచారం, ఖమ్మంపల్లి, గిరాయిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. రాయపోలు మండలం వడ్డేపల్లి, గొల్లపల్లి, ఎల్కకల్, రామారం గ్రామాల్లో ఐకేపీ ఏపీఎం కిషన్, కోహెడ మండలం బస్వాపూర్, ఆరెపల్లి, పోరెడ్డిపల్లి, నాగసముద్రాల, దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లితో పాటు పలు గ్రామాల్లో ఐకేపీ ఏపీఎంలు కిషన్, తిరుపతి గౌడ్, యాదగిరి ప్రారంభించారు. కోహెడ మండలంలోని పలు కేంద్రాలను ఎంపీడీవో కృష్ణయ్య పరిశీలించారు. నంగునూరు మండల పరిధి ఘనపూర్, ఆరేపల్లి, నంగునూరు, కొండంరాజుపల్లి, సిద్దన్నపేట తదితర గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఛైర్మన్ కోల రమేష్‌గౌడ్ ప్రారంభించారు.


బందారందర్గాలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ దిలీప్‌నాయక్

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

గజ్వేల్, న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మేలు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో భారాసకు చెందిన పలువురు కార్యకర్తలు గురువారం ఆయన సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్, సుఖేందర్ రెడ్డి, యాదగిరి, రాజు, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

దుబ్బాక, న్యూస్‌టుడే: బాలబాలికల హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ నర్సింలు అన్నారు. గురువారం హబ్షీపూర్ మహాత్మా జ్యోతిబా పులే బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న డీపీవో దేవకీదేవి

చేర్యాల, న్యూస్‌టుడే: ఇంటి, కుళాయి పన్నులు వందశాతం వసూలయ్యేలా చూడాలని, అందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని డీపీవో దేవకీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూల్మిట్ట మండలాల గ్రామపంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వసూళ్లపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి అనుమతులకు పాటించాల్సిన నిబంధనలు వివరించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎండీ మహబూబ్‌అలీ, పంచాయతీ అధికారులు శ్రీనివాసవర్మ, వీరరాజు, గ్రామీణ నీటిసరఫరా డీఈఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ నూతన కార్యవర్గం

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: వీహెచ్‌పీఎస్ అక్కన్నపేట మండల అధ్యక్షురాలిగా యాటపోలు వసంత ఎన్నికయ్యారు. గురువారం అక్కన్నపేటలో జరిగిన సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జీల సదయ్య, ప్రధాన కార్యదర్శిగా పీరెల్లి అశోక్, కోశాధికారిగా నార్లపురం సమ్మయ్య, సభ్యులుగా కర్ణకంటి పుష్ప, తంగళ్లపల్లి చిన్నభూమయ్య, గుండా అశోక్, గొట్టె యాదయ్య ఎన్నికయ్యారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రాయపోల్, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట కార్మికులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం సుధాకర్ రెడ్డి, కార్యదర్శి యాదగిరి ఉన్నారు.

పంకాలు, కుర్చీల వితరణ

నంగునూరు, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయానికి రంగధాంపల్లికి చెందిన దాత వంగ రాజేశ్వర్‌రెడ్డి రూ.25 వేల విలువ చేసే పంకాలు, కుర్చీలు గురువారం అందజేశారు. ఈ మేరకు దాతను తహసీల్దార్ సరిత అభినందించారు.

రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని ఆందోళన


చేర్యాల జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

చేర్యాల, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు జనగామలో జరిగిన ప్రచార సభలో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన మేరకు డివిజన్ ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చేర్యాల పట్టణంలో జాతీయ రహదారిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తాడూరి భరత్‌కుమార్, విక్రమ్, ప్రసాద్, రంజిత్, రాజు, శివ, ప్రశాంత్, ప్రవీణ్, రవితేజ పాల్గొన్నారు.

సేవా పుస్తకాల అందజేత

జగదేవపూర్, న్యూస్‌టుడే: డీఎస్సీ ద్వారా కొత్తగా మండలంలో కొత్తగా నియమితులైన 15 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎస్జీటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సేవా పుస్తకాలు, టీఎస్‌జీఎల్ఐసీ దరఖాస్తు ఫారాలను అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పృథ్వీ, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులే నిజమైన కథానాయకులు


మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేట, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు నిజమైన కథానాయకులని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరిన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధ చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాణాలు పోసే వైద్య వృత్తిని ఎంచుకుంటున్న వారు సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విమలాథామస్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

సిద్దిపేట, న్యూస్‌టుడే: మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి డా.నరేందర్‌రెడ్డి సిద్దిపేటలోని మహాశక్తినగర్‌లో ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.

వాహనదారులు జరభద్రం

పట్టణంలోని రాఘవేంద్రనగర్ రెండో వీధిలో ఓ విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించని సమయంలోవిద్యుత్తు శాఖ అధికారులు స్తంభాలు పాతారు. కాలక్రమేణా అభివృద్ధి చెందడం..చకచకా ఇళ్ల నిర్మాణం సైతం ఊపందుకోవడంతో ఆ వీధిలో ఓ స్తంభం ఇలా రోడ్డుకు మధ్యలో మిగిలిపోయింది. దీనిని ఆ ప్రాంతం నుంచి తొలగించి ఓ పక్కకు ఏర్పాటు చేయాల్సి ఉండగా అలా చేయకుండా రోడ్డు మధ్యలోనే ఉంచి బీటీ రోడ్డు సైతం వేశారు. ఫలితంగా ఆ కాలనీలోకి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలం అయితే జాగ్రత్తగా ఉండాల్సిందే. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని స్తంభాన్ని పక్కన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్



గర్భిణులకు వైద్య పరీక్షలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రతి గురువారం గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని హెచ్ఈవో పాండురంగాచారి తెలిపారు. చింతమడక, రాఘవాపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాలకు చెందిన గర్భిణులకు గురువారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు సూచనలిచ్చారు. వైద్యురాలు శ్వేత పాల్గొన్నారు.

మీర్జాపూర్‌లో కళ్లద్దాల పంపిణీ

హుస్నాబాద్ గ్రామీణం: మీర్జాపూర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ హన్మకొండ ఆధ్వర్యంలో కంటిచూపు సరిగా లేని బాధితులకు గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. నాయకులు వెంకట్రాం రెడ్డి, మహేందర్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టిదారులకు మహర్దశ!

మరమ్మతులకు రూ.16 లక్షలు మంజూరు

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో పలుచోట్ల మట్టి రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకల వేళ ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇక్కట్లను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఫ్లడ్ డ్యామేజీ కింద రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తూ జిల్లా పాలనాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.


కోతకు గురైన బండ మీదితండా రోడ్డు

8 మార్గాల్లో పనులు

అక్కన్నపేట, కోహెడ మండలాల్లోని 8 రోడ్ల మరమ్మతులకు రూ.16లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈ మహేశ్వర్ తెలిపారు. అక్కన్నపేట మండలం మబ్బుకుంటతండా నుంచి రంగన్నకుంట వరకు రూ.2లక్షలు, పంచాయతీరాజ్ రోడ్ నుంచి మైసమ్మవాగుతండా వరకు రూ.2లక్షలు, పీఆర్ రోడ్ నుంచి బండ మీదితండా వరకు రూ.2లక్షలు, కోహెడ నుంచి తంగళ్లపల్లి క్రాస్ రోడ్ మీదుగా కూరెల్ల వరకు రూ.2లక్షలు, పోరెడ్డిపల్లి నుంచి అప్పిసకాలనీ రోడ్డుకు రూ.2లక్షలు, ఎర్రగుంటపల్లి నుంచి ఇందుర్తి క్రాస్‌రోడ్ వరకు రూ.2లక్షలు, ఎర్రగుంటపల్లి నుంచి రాంచంద్రాపూర్ రోడ్డుకు రూ.2లక్షలు, వింజపల్లి నుంచి పెరుకలగడ్డ రోడ్డుకు రూ.2లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో కోతకు గురైన, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయనున్నారు.

అనాథ వృద్ధులకు చేయూత


సామగ్రి పంపిణీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ పురాధ్యక్షురాలు రజిత

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండలంలోని బెజ్జంకిక్రాసింగ్‌లో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో గురువారం అనాథ వృద్ధుల ఆదరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో సమకూర్చిన నిత్యావసర సరకులు, దుస్తులు, దుప్పట్లు, ఇతర సామగ్రి అందజేశారు. బెజ్జంకి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి క్రిష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, సంస్థ ప్రతినిధులు అన్నామెరీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలోని వేడుక మందిరంలో బాల వికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు గురువారం నిత్యావసర వస్తువులు, దుస్తులు, దుప్పట్లు, పిల్లలకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. పురపాలక, సహకార సంఘాల ఛైర్మన్లు రజిత, శివయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లింగమూర్తి, బాల వికాస ప్రతినిధి రాణి తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్ ఎంపికపై నిరసన

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: నాగారం ప్రాథమికోన్నత పాఠశాలలో స్కావెంజర్ ఎంపిక విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాల గేట్‌ముందు బైఠాయించి నిరసన తెలిపారు. స్కావెంజర్ నియామకానికి హెచ్‌ఎం విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులను ఆహ్వానించారు. ఎంపిక విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు వ్యతిరేకిస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మనీల బడికి వచ్చి వారితో మాట్లాడారు. ఈ నెల 28న మరోసారి సమావేశం నిర్వహించి అందరి సమక్షంలో ఎంపిక చేద్దామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

ఉద్యమకారులకు కరవైన గుర్తింపు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హామీలను నెరవేర్చాలని డిమాండు చేస్తూ ఉద్యమకళాకారుల సంఘం నాయకులు ఆదిలాబాద్ నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం సిద్దిపేటకు చేరుకుంది. మోడ్రన్‌బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులు, ఉద్యమకారులకు సరైన గుర్తింపు లభించడం లేదని రాష్ట్ర నాయకులు శ్రీశైలం, వెంకన్న వాపోయారు.

వేతన సవరణ ప్రకటించండి

సిద్దిపేట, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్మికులకు 2021 సంవత్సరానికి సంబంధించి కనీసం 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ ప్రకటించాలని సిద్దిపేటకు చెందిన రాష్ట్ర ఆర్టీసీ ఐకాస కన్వీనర్ ఎండీ మౌలానా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాడెడ్ల అపహరణ

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల పట్టణంలోని కర్రె లింగంకి చెందిన రెండు కాడెడ్లు అపహరణకు గురైనట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఇటీవల మద్యం తాగి పట్టుబడిన ఎనిమిది మంది వాహనదారులకు గురువారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు రూ.12000 జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు


హుస్నాబాద్‌లో పోటీలో పాల్గొన్న పోలీసులు

సిద్దిపేట టౌన్, హుస్నాబాద్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిషనరేట్‌లో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి వరకు 'సమాజంలో పోలీసుశాఖ ప్రతిష్ఠను మెరుగుపరచటంలో పోలీసుల పాత్ర', ఎస్సై స్థాయి నుంచి పైస్థాయి అధికారులకు 'దృఢమైన శరీరంలో దృఢమైన మనస్సు' అనే అంశాలపై పోటీ కొనసాగింది. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్లకు చెందిన పోలీసులు, అధికారులు పోటీలో పాల్గొన్నారు. ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్ పోటీలను పర్యవేక్షించారు. ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని ఆయన వెల్లడించారు.

కోహెడ: కోహెడలో ఎస్సై అభిలాష్ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్సైతో పాటు 25 మంది దాతలు రక్తదానం చేశారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ సర్కిల్‌లో కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు పోలీసులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. మొదటి ముగ్గురు విజేతలను జిల్లా స్థాయికి పంపిస్తామని ఏసీపీ వాసాల సతీశ్ తెలిపారు. హుస్నాబాద్‌లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించామని ఎస్సై తోట మహేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సైదా, ర.భ. శాఖ అధికారులు

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. గురువారం ర.భ. శాఖ డీఈ వెంకటేశ్వరరావు, హైవే అథారిటీ అధికారి వెంకటరెడ్డితో కలిసి రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరిగే స్థలాలను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మానవ తప్పిదాల వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. చోదకులు పోటీ పడి వాహనాలు నడపవద్దన్నారు. ప్రమాదాలు జరిగే చోట వేగ నియంత్రణ బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

మహా పాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: మాలల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వాలు కృషి చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఈ నెల 25న భద్రాచలం నుంచి ప్రారంభమయ్యే మహా పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను గురువారం అక్బర్ పేట-భూంపల్లి మండల కేంద్రంలో పొలిట్ బ్యూరో ఛైర్మన్ ర్యాకం శ్రీరాములుతో కలిసి ఆవిష్కరించారు. మాలలు, అనుబంధ కులాలు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు పాదయాత్రలో పాల్గొనాలని కోరారు.

రుణమాఫీ కొందరికేనా: సీపీఎం

జగదేవపూర్, న్యూస్‌టుడే: రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులతో కొందరికే పరిమితం చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. మండల పరిధి తీగుల్‌లో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా ఊసే లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి కర్షకులకు న్యాయం చేయాలని కోరారు.